# సాక్షి సూర్యాపేట

శనివారం । 28 । డిసెంబర్ । 2024




**గురుకులాల్లో ప్రవేశాలకు..**
గురుకుల పాఠశాలల్లో 2025–26 విద్యా సంవత్సరానికి ఐదో తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలయ్యింది. - 10లో




**దర్శనానికి వెళ్లొస్తూ..**
యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వచ్చి తిరుగు ప్రయాణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. - 10లో



**సఖ్యతకు అడ్డొస్తున్నాడనే హత్య**
సఖ్యతకు అడ్డొస్తున్నాడని భార్య ప్రియుడితో పాటు మరో వ్యక్తితో కలిసి భర్తను దారుణంగా హత్య చేసింది. - 10లో

## న్యూస్‌రీల్

### 31 వరకు బ్యాంక్ సేవలు నిలిపివేత

**సూర్యాపేట:** ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకును జనవరి 1 నుంచి తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంకులో విలీనం చేస్తున్నందున శనివారం నుంచి ఈనెల 31 వరకు బ్యాంకింగ్ సేవలు నిలిపివేయనున్నట్లు ఏపీజీవీబీ బ్యాంకు చీఫ్ మేనేజర్ అజయ్ ఆనంద్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సూర్యాపేట బ్రాంచ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూపీఐ, ఏటీఎం, మొబైల్ బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉండవని, ఖాతాదారులు సహకరించాలని కోరారు. ఖాతా నంబర్ మారదని, బ్యాంకుకు సంబంధించిన సందేహాలు ఉంటే బ్రాంచ్‌లో సంప్రదించాలని తెలిపారు.

### ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడిగా పాపయ్య గౌడ్



నియామకపత్రం అందజేస్తున్న పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి

**సూర్యాపేట:** ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడిగా కాసాని పాపయ్య గౌడ్ నియామకమయ్యారు. ఈమేరకు పీసీసీ సభ్యుడు, పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి శుక్రవారం స్థానిక రెడ్‌హౌస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాపయ్య గౌడ్ మాట్లాడుతూ.. తన నియామకానికి కృషి చేసిన మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డికి, ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్, రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు, డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, ఐఎన్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎరగాని నాగయ్యగౌడ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గౌస్, జిల్లా ఉపాధ్యక్షుడు ముజ్జు బాయ్, జంగం మహేష్, కార్యదర్శి కప్పల ఉపేందర్, కోశాధికారి బడుగుల చంద్రశేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### కనుల పండువగా ఊంజల్ సేవోత్సవం

**యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం కనులపండువగా నిర్వహించారు. అమ్మవారిని పట్టువస్త్రాలు, వజ్రవైఢూర్యాలతో అలంకరించి, ఆలయ తిరు, మాఢ వీధుల్లో ఊరేగించారు. అనంతరం అద్దాల మండపంలో ప్రత్యేక వేదికపై అమ్మవారిని తీర్చిదిద్ది ఊంజల్ సేవోత్సవం చేపట్టారు. అమ్మవారికి ఇష్టమైన నాథ స్వరం వినిపించారు. ఇక ప్రధానాలయంలో సంప్రదాయపూజలు కొనసాగాయి. వేకువజామున సుప్రభాత సేవ చేపట్టి గర్భాలయంలో స్వయంభూలకు అభిషేకం, అర్చన చేశారు. అనంతరం ఆలయ ముఖమండపంలో సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం తదితర పూజలు నిర్వహించారు.

## • మన్మోహన్‌సింగ్‌కు నివాళి



మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపం తెలుపుతూ శుక్రవారం సూర్యాపేటలో ఆయన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏఐసీసీ సభ్యుడు కొప్పుల వేణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు

### ప్రధానోపాధ్యాయుడి సస్పెన్షన్

**సూర్యాపేట టౌన్ :** విధుల్లో నిర్లక్ష్యం వహించిన జీహెచ్‌ఎంను సస్పెండ్ చేస్తూ డీఈఓ అశోక్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 23న సూర్యాపేట మండలం టేకుమట్ల జెడ్పీ హై స్కూల్‌ను డీఎల్ఎస్ఏ సెక్రెటరీ, జడ్జి శ్రీవాణి తనిఖీ చేశారు. విద్యార్థులు ఇంటి నుంచి భోజనం తెచ్చుకోవడంతో ఆరా తీశారు. భోజనం సరిగ్గా ఉండడం లేదని, మాడిపోయిన అన్నం పెడుతున్నారని విద్యార్థులు జడ్జికి తెలిపారు. దీంతో సిబ్బందిపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేవిధంగా పరిసరాలు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా లేకపోవడంతో హెడ్మాస్టర్ పాపయ్యపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో విచారణ చేయాలని డీఈఓ అశోక్‌ను కలెక్టర్ ఆదేశించారు. విచారణలో వాస్తవాలు తేలడంతో హెడ్మాస్టర్ పాపయ్యను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# రెవెన్యూ విధులకు గ్రామానికో అధికారి

- గ్రామాల్లో రెవెన్యూ వ్యవస్థను పటిష్టం చేసేందుకు ప్రభుత్వం చర్యలు
- గ్రామస్థాయి అధికారి నియామకానికి కసరత్తు
- గతంలో వీఆర్‌ఓ, వీఆర్‌ఏలుగా పనిచేసిన వారికి అవకాశం
- దరఖాస్తుల సమర్పణకు నేటితో ఆఖరు



**భానుపురి (సూర్యాపేట):** గ్రామాల్లో రెవెన్యూ వ్యవస్థను పటిష్టం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గత ప్రభుత్వం రద్దు చేసిన వీఆర్‌ఓ, వీఆర్‌ఏల స్థానంలో విలేజ్ లెవల్ ఆఫీసర్ (గ్రామస్థాయి అధికారి)ని నియమించనుంది. ఇందుకోసం గతంలో జిల్లాలో వీఆర్‌ఓ, వీఆర్‌ఏలుగా పనిచేసిన వారికి అవకాశం కల్పించి.. ఆసక్తి ఉన్న వారిని గ్రామస్థాయి అధికారిగా నియమించాలని భావిస్తోంది. ఇప్పటికే గత పది రోజులుగా దరఖాస్తులు స్వీకరిస్తోంది. వీటిని సమర్పించేందుకు శనివారం చివరి రోజుగా నిర్ణయించింది. ఈ దరఖాస్తులను నేరుగా ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో చేసుకోవాల్సి ఉంది. ప్రభుత్వ నిర్ణయంతో వీఆర్‌ఓ, వీఆర్‌ఏలుగా పనిచేసిన వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నా.. పలు కారణాలతో తిరిగి వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది.

**16 శాఖల్లో సర్దుబాటు..**

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2020లో గ్రామస్థాయిలో వీఆర్‌ఓ, వీఆర్‌ఏలుగా పనిచేసిన వారిని తొలగించింది. ఈ సమయంలో జిల్లాలో వీఆర్‌ఏ, వీఆర్వోలుగా దాదాపు 261 మంది పనిచేస్తుండగా.. 16 శాఖల్లో విద్యార్హతల ఆధారంగా వీరిని 2022లో వివిధ శాఖల్లోకి తీసుకున్నారు. ప్రస్తుత ప్రభుత్వం మళ్లీ గ్రామపాలనను గాడిలో పెట్టేందుకు గ్రామస్థాయి అధికారులు అవసరమని గుర్తించింది. ఈ మేరకు వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న వారికి ఆసక్తి ఉంటే దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ ప్రక్రియలో కొన్ని నిబంధనలు ఉండగా.. విద్యార్హత ఆధారంగా హోదా కల్పించాలని భావిస్తోంది. ఇంటర్‌తో పాటు గణితం చదివిన వారికి సర్వేయర్‌గా అవకాశం కల్పించనుంది.

**సీనియారిటీ ఏమవుతుందోనని..**

గత ప్రభుత్వం 121 జీఓ ప్రకారం వీఆర్‌ఓ, వీఆర్‌ఏల వ్యవస్థను రద్దు చేసింది. దీంతో తమ 15 ఏళ్ల సర్వీసును కోల్పోయి నూతనంగా వివిధ శాఖల్లో జాయిన్ అయ్యారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం కొత్త చట్టం ద్వారా గ్రామస్థాయి అధికారి వ్యవస్థను తిరిగి తీసుకొస్తున్నందున కొంత మంది ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. గత ప్రభుత్వం కారణంగా 15 ఏళ్ల సర్వీస్ కోల్పోయామని, ఇప్పటికే నాలుగేళ్లుగా ఇతర శాఖలో పనిచేస్తుండగా కొత్త చట్టం ఆధారంగా గ్రామస్థాయి అధికారిగా నియామకమైతే ఈ సర్వీసును కోల్పోవాల్సి ఉంటుందన్న భావన వారిలో నెలకొంది.

# నిఘా నీడలో ఇంటర్ ప్రాక్టికల్స్

- సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని ఇంటర్ బోర్డు ఆదేశాలు
- ప్రాక్టికల్స్, థియరీ, స్ట్రాంగ్, స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాల్లో ఏర్పాటు



ప్రాక్టికల్స్ చేయిస్తున్న అధ్యాపకుడు

**కోదాడ:** ఫిబ్రవరి మొదటివారం నుంచి ప్రారంభంకానున్న ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలను నిఘానీడలో నిర్వహించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకోసం ప్రయోగశాలల్లో సీసీ కెమెరాలను యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయాలని, దానికి కావాల్సిన ప్రతిపాదనలను వెంటనే బోర్డుకు పంపాలని ఈ నెల 23న ఇంటర్ బోర్డు కార్యదర్శి ఆదేశాలు జారీ చేశారు. తమ పరిధిలో ఉన్న ప్రభుత్వ కళాశాలలను పరిశీలించి ప్రతి కళాశాలకు ఎన్ని సీసీ కెమెరాలు అవసరమవుతాయో ప్రతిపాదనలు పంపాలని సూచించడంతో ఈనెల 24న ప్రతిపాదనలు రూపొందించి ఇంటర్ బోర్డుకు పంపించారు.

**ఎక్కడ ఏర్పాటు చేస్తారంటే...**

గతంలో ఇంటర్ థియరీ పరీక్షా కేంద్రాల్లో పరీక్షా పత్రాలను ఓపెన్ చేసే గదిలో మాత్రమే సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వాటి సమక్షంలోనే అధికారులు పరీక్షా పత్రాల బండిల్స్ ఓపెన్ చేసేవారు. తాజాగా ఇంటర్ బోర్డు కార్యదర్శి డీఐఈవోలకు పంపించిన ఆదేశాల ప్రకారం ఈ సంవత్సరం థియరీ పరీక్షలు నిర్వహించే అన్ని గదుల్లో, ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించే ల్యాబ్‌లలో, పరీక్ష పత్రాల బండిల్స్ ఓపెన్ చేసే కాన్ఫిడెన్షియల్ గది, స్ట్రాంగ్ రూంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈమేరకు నాలుగు ప్రయోగశాలలు, ప్రిన్సిపాల్ రూమ్, 10 నుంచి 12 తరగతి గదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం.

**ప్రైవేట్‌లో కూడా ఏర్పాటు చేయాల్సిందే..**

జిల్లాలో మొత్తం 72 జూనియర్ కళాశాలలుండగా వాటిలో 8 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 9 మోడల్, 8 సోషల్ వెల్ఫేర్, 16 రెసిడెన్షియల్ కళాశాలలు, 5 కేజీబీవీ, 26 ప్రైవేట్ జూనియర్ కళాశాలల వరకు ఉన్నాయి. వీటిలో 2024–25 విద్యాసంవత్సరానికి ద్వితీయ సంవత్సరంలో 8,325 మంది విద్యార్థులు చదువుతుండగా వారిలో దాదాపు 5 వేల మంది వరకు సైన్స్ విద్యార్థులున్నారు. వీరంతా ఫిబ్రవరి మొదటివారంలో జరిగే ప్రాక్టికల్ పరీక్షలకు హాజరు కావాల్సివుంది. ఈ కళాశాలలన్నింటిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాల్సిందేనని బోర్డు అధికారులు ఆయా మేనేజ్‌మెంట్లకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. ఈ సంక్రాంతి లోపు సీసీ కెమెరాల ఏర్పాటు పూర్తి చేయాలని సూచించింది.

**తూతూమంత్రంగా నిర్వహిస్తుండడంతో**

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలను ప్రైవేట్ జూనియర్ కళాశాలలతో పాటు రెసిడెన్షియల్ కళాశాలలు తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారని, కనీసం ల్యాబ్ ఎలా ఉంటుందో చూడకుండానే విద్యార్థులకు ప్రాక్టికల్స్‌లో నూటికి నూరు శాతం మార్కులు వేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. దీనికి చెక్ పెట్టాలని అధికారులు నిర్ణయించారు. ఈ క్రమంలో ప్రతి ప్రభుత్వ కళాశాలకు ప్రాక్టికల్ మెటీరియల్ కొనుగోలు కోసం రూ.25 వేలను మంజూరు చేశారు. తాజాగా ల్యాబ్‌లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ప్రాక్టికల్స్ పరీక్షలను గాడిలో పెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

## కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలి



సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యాంకుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏజీపీ రేణుకాదేవి

**హుజూర్‌నగర్:** కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యాం కుమార్ అన్నారు. హుజూర్‌నగర్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టుకు సహాయ ప్రభుత్వ న్యాయవాది (అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్) గా రేణుకాదేవి నియామకమయ్యారు. శుక్రవారం ఆమె ఆమె బాధ్యతలు స్వీకరించి స్థానిక సీనియర్ సివిల్ జడ్జిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. ఏజీపీగా సమర్థవంతంగా పనిచేస్తూ ఉత్తమ సేవలు అందించాలన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జక్కుల వీరయ్య, ఉపాధ్యక్షుడు జక్కుల నాగేశ్వరరావు, న్యాయవాదులు రవి కుమార్, కాల్వ శ్రీనివాసరావు, బుడిగ నరేష్, మోహన్, వీజీకే మూర్తి, ఎంఎస్ రాఘవ రావు, కొట్టు సురేష్, పాలేటి శ్రీనివాసరావు, శంకర్ నాయక్, వెంకటేష్ నాయక్, మీసాల అంజయ్య పాల్గొన్నారు.

## ఒంటికాలిపై నిలబడి నిరసన



కలెక్టరేట్ ఎదుట ఒంటికాలిపై నిలబడి నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

**భానుపురి (సూర్యాపేట) :** సమగ్ర శిక్షా ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట వినూత్న రీతిలో నిరసన తెలుపుతున్నారు. శుక్రవారం వారు ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు సమగ్ర శిక్షా ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు రెగ్యులర్ చేయాలన్నారు. కార్యక్రమంలో సునీత, వెంకటేశ్వర్లు, అనిత, నాగమణి, సైదులు, రాజు, జోసెఫ్, అంజి, సయ్యద్, సూర్యకళ, రమేష్, నీరజ పాల్గొన్నారు.

### బంజారా ఎంప్లాయిస్ సేవా సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అజయ్



**పెన్‌పహాడ్:** తెలంగాణ బంజారా ఎంప్లాయిస్ సేవా సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మండల ఏపీఎం అజయ్‌నాయక్ నియామకమయ్యారు. ఈమేరకు రాష్ట్ర అధ్యక్షుడు పీపీ రాథోడ్, ప్రధాన కార్యదర్శి తుల సీరాం శుక్రవారం తెలిపారు.

### వైభవంగా నారసింహుడి నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

**మఠంపల్లి:** మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం,, పంచామృతాభిషేకం, ప్రత్యేకార్చనలు చేశారు. అనంతరం ఎదుర్కోళ్ల మహోత్సవం జరిపించి, విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, రక్షాబంధనం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ పూర్తిగావించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

# డీఏపీ ధరలకు రెక్కలు

- ఈ సీజన్‌లో రైతులపై పెనుభారం
- డీఏపీ బస్తా ధర రూ.1,350 ఉండగా జనవరి 1 నుంచి రూ.1,650కు విక్రయం
- డీలర్ల వద్ద ఉన్న పాత స్టాకును పాత ధరకే విక్రయించాలంటున్న వ్యవసాయాధికారులు

**నాగారం:** డీఏపీ ఎరువు ధర బస్తాకు ఏకంగా రూ.300 మేర పెరగనుంది. జనవరి 1వ తేదీ నుంచి కొత్త ధరలు అమల్లోకి రానున్నాయి. దీంతో ఈ సీజన్‌లో రైతులపై పెనుభారమే పడనుంది. జిల్లాలో యాసంగి సాగు 4.85 లక్షల ఎకరాల వరకు ఉండనుందని వ్యవసాయ శాఖ అంచనా. ఇందులో అధిక భాగం వరి పంటదే. ఎస్సారెస్పీ కాలువలు, బోరుబావుల కింద రైతులు పెద్ద ఎత్తున వరి సాగు చేస్తున్నారు. అయితే ప్రస్తుతం జిల్లాలో ఎరువుల కొరత మాత్రం లేదని, ధరలు పెరిగినా డీఏపీ కొరత ఉండదని అధికారులు చెబుతున్నారు.




**బస్తా రూ.1,650**

డీఏపీ బస్తా (50 కేజీలు) ధర రూ.1,350 ఉండగా జనవరి 1వ తేదీ నుంచి రూ.1,650 కానుంది. జిల్లా వ్యాప్తంగా యాసంగిలో సుమారు 4,000 మెట్రిక్ టన్నుల డీఏపీ వినియోగం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా డీఏపీ ధరల పెంపుతో మెట్రిక్ టన్నుకు రూ.6 వేల చొప్పున రూ.2.40 కోట్ల వరకు అదనపు భారం పడనుంది. అయితే డీలర్ల వద్ద ఉన్న పాత స్టాకును పాత ధర రూ.1,350 మేరకే విక్రయించాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. జిల్లాలో డీఏపీ వాడకం తక్కువగానే ఉంటుందని, డీలర్లు ధరలు పెరిగినా, పెరగకపోయినా బస్తాపై ఉన్న ఎమ్మార్పీ ధరలకే రైతులకు విక్రయించాలని పేర్కొంటున్నారు.

**బస్తాలపై ఉన్న ఎమ్మార్పీ రేటుకే రైతులకు విక్రయించాలి**



డీఏపీ ధరలు పెరుగుతాయని ప్రస్తుతానికి అధికారికంగా ఎలాంటి సమాచారం లేదు. రైతులు డీఏపీ ధరలు పెరుగుతాయని భావించి తొందర పడి కొనుగోలు చేయొద్దు. డీఏపీ ధరలు పెరిగినా, పెరగకపోయినా డీలర్లు బస్తాలపై ఉన్న ఎమ్మార్పీ రేటుకే రైతులకు విక్రయించాలి.

– శ్రీధర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, సూర్యాపేట

# నేటి నుంచి యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలు

- తొలి రోజు భారీ ర్యాలీ, బహిరంగ సభ
- రెండు రోజుల పాటు ప్రతినిధుల సభలు
- ముస్తాబైన నల్లగొండలోని లక్ష్మీగార్డెన్స్ ఆవరణ
- హాజరుకానున్న మంత్రి కోమటిరెడ్డి

**నల్లగొండ:** టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర 6వ మహాసభలకు ఆ సంఘం సర్వం సిద్ధం చేసింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదటిసారిగా నల్లగొండలో శనివారం నుంచి మూడు రోజుల పాటు జరగనున్న ఈ మహాసభలకు పట్టణంలోని ప్రధాన కూడళ్లను యూటీఎఫ్ తోరణాలతో అలంకరించారు. అతిథులకు ఆహ్వానాలు పలుకుతూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. దీంతో పట్టణమంతా యూటీఎఫ్ తోరణాలతో ఎరుపెక్కింది.

**మొదటి రోజు బహిరంగ సభ**

యూటీఎఫ్ ఏర్పడిన తర్వాత రెండోసారి నల్లగొండ జిల్లాలో రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నారు. మూడు రోజుల పాటు జరగనున్న సభల్లో భాగంగా మొదటి రోజైన శనివారం ఉదయం 9:30 గంటలకు గడియారం సెంటర్ నుంచి 5వేల మందికి పైగా ఉపాధ్యాయులతో హైదరాబాద్ రోడ్డులోని లక్ష్మీగార్డెన్ వరకు మహిళల కోలాట ప్రదర్శన, కళాకారుల ఆటా పాటలతో భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. లక్ష్మీ గార్డెన్స్ ఆవరణలో యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించిన అనంతరం అక్కడే ఉదయం 10 గంటలకు బహిరంగ సభ నిర్వహిస్తారు.

**సభకు హాజరయ్యే ముఖ్య అతిథులు వీరే..**

ఈ సభకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర రోడ్లు, భవనాలు, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి హాజరుకానున్నారు. అలాగే విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నర్సింహారెడ్డి, ప్రొఫెసర్ నాగేశ్వర్‌రావు, ఢిల్లీ యూనివర్సిటీ నాయకురాలు ఐసీ ఘోష్‌తోపాటు కె.శ్రీనివాస్, యూటీఎఫ్ ఆహ్వాన సంఘం చైర్మన్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పాల్గొంటారు. అదే రోజు రాత్రి లక్ష్మీగార్డెన్స్‌లో కవి, గాయకుడు, రచయిత సుద్దాల అశోక్‌తేజ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, ఖమ్మం జిల్లాలకు చెందిన కళాకారులు తమ కళారూపాలను ప్రదర్శించనున్నారు.



బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, యూటీఎఫ్ నాయకులు

**29, 30 తేదీల్లో ప్రతినిధుల సభలు**

29, 30 తేదీల్లో యూటీఎఫ్ ప్రతినిధుల సభలు నిర్వహిస్తారు. రెండో రోజైన ఆదివారం విద్యారంగంలో వచ్చిన మార్పులు, భవిష్యత్‌లో వచ్చే పరిణామాలపై చర్చించి తీర్మానాలు చేయనున్నారు. చివరి రోజు సోమవారం సంఘం రాష్ట్ర కమిటీ ఎన్నుకుంటారు.

**యాభై ఏళ్లలో రెండోసారి**



యూటీఎఫ్ ఏర్పడి 50 సంవత్సరాలైంది. రాష్ట్రంలో రెండోసారి నల్లగొండలో యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలు నిర్వహించుకుంటున్నాం. ఉమ్మడి రాష్ట్రంలో 2009లో మొదటిసారి నల్లగొండలో రాష్ట్ర మహాసభలు నిర్వహించాం. తెలంగాణ వచ్చిన తర్వాత రెండోసారి నిర్వహిస్తున్నాం. అన్ని జిల్లాల నుంచి ప్రతినిధులు హాజరవుతారు.

– పెరుమాళ్ల వెంకటేశం, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

**విజయవంతం చేయాలి**

**- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి**

నల్లగొండ జిల్లా కేంద్రంలో జరగనున్న టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర మహాసభల ఏర్పాట్లను శుక్రవారం ఆ సంఘం ఆహ్వాన కమిటీ చైర్మన్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ మహాసభలు చరిత్రలో నిలబడబోతున్నాయని తెలిపారు. ఈ మహాసభలకు భారీగా తరలి వచ్చి విజయవంతం చేయాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా మహాసభల్లో చర్చిస్తామని పేర్కొన్నారు.

## ప్రకృతిని కాపాడుకుందాం



మాట్లాడుతున్న యానాల వెంకట్‌రెడ్డి

**సూర్యాపేటటౌన్:** ప్రకృతిని కాపాడుకోవడంలో భాగస్వాములమవుదామని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రివల్యూషన్ రాష్ట్ర కో ఆర్డినేటర్ యానాల వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సరస్వతి విద్యానిలయంలో రాస్కర్ల విద్యాశాఖ, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రివల్యూషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రకృతిని, భూమాతను కాపాడడానికి స్వచ్ఛంద సంస్థలు కంకణబద్ధులు కావడం అభినందనీయమన్నారు. మట్టి, గాలి, నీరు, కలుషితం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ దండ మురళీధర్‌రెడ్డి, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు నెమ్మాది సంజీవయ్య, కొండారెడ్డి, ముప్పారపు నరేందర్, సునీల్, శ్రీనివాస్, వంశీ, వేణు మాధవ్, పరందాములు, మదనాచారి పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### పంట పొలంలో కొండ చిలువ



హరిప్రసాద్ పొలంలో భారీ కొండ చిలువ

యాదగిరిగుట్ట : ఓ రైతు పొలంలోకి భారీ కొండ చిలువ వచ్చింది. తుర్కపల్లి మండల కేంద్రంలో బోయిని హరిప్రసాద్ అనే రైతు రోజు మాదిరిగానే తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో అతడు పొలంలో తిరుగుతుండగా భారీ కొండ చిలువ చిన్న అడవి పిల్లను మింగుతూ కనిపించింది. దీంతో భయాందోళనకు గురైన హరిప్రసాద్ వెంటనే తన వద్ద ఉన్న సెల్ ఫోన్‌లో వీడియో తీసి పరిగెత్తుకుంటూ వచ్చి గ్రామస్తులకు సమాచారం అందించాడు. స్థానికులు వచ్చే సమయానికి కొండ చిలువ పక్కనే ఉన్న అటవీ ప్రాంతంలోకి వెళ్లింది.

### గంజాయి విక్రయిస్తున్న యువకుల అరెస్ట్



పట్టుబడిన నిందితులతో ఎక్సైజ్ పోలీసులు

కోదాడరూరల్ : పట్టణంలోని కేఆర్ఆర్ కళాశాల వెనుక వైపు గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను శుక్రవారం కోదాడ ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. సీఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్లకు చెందిన మెల్సు మధు, ఇంజమూరి యశ్వంత్ జల్సాలకు అలవాటు పడి డబ్బుల కోసం గంజాయి విక్రయిస్తున్నారు. వారు ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో గంజాయిని తక్కువ రేటుకు తీసుకొచ్చి స్థానిక కేఆర్ఆర్ కళాశాల వెనుక వైపు విక్రయిస్తున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించి యువకులను పట్టుకున్నారు. ఈ దాడుల్లో వారి నుంచి 900గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని రిమాండ్ చేసినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐలు గోవర్ధన్, రామకృష్ణ, యాదయ్య, సిబ్బంది అస్గర్‌అలీ, శ్రీనివాస్, లక్ష్మీనారాయణరావు, సలీమ్, దాసు, రాము, నరేష్, బాలు, జ్యోతి, భవానీ ఉన్నారు.

### యువకుడు అదృశ్యం.. కేసు నమోదు

మిర్యాలగూడ టౌన్ : ఇంటి నుంచి వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ ఘటనకు సంబంధించి శుక్రవారం రూరల్ ఎస్ఐ వివరాలు వెల్లడించారు. మండలంలోని ఐలాపురం గ్రామానికి చెందిన బాణోతు శ్రీను తన కుటుంబ సభ్యులతో కలిసి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం గుడిమల్కాపురంలో సెంట్రింగ్ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో బాణోతు శ్రీను పెద్దకుమారుడు రాజేష్ (21) మిర్యాలగూడ మండలంలోని మైసమ్మకుంటతండాలోని తన బంధువులు బాణోతు బుల్లి ఇంటికి వెళ్తున్నానని చెప్పి నవంబర్ 15న గుడిమల్కాపురం నుంచి వచ్చాడు. ఆ రోజు రాత్రి బాణోతు బుల్లి ఇంటికి చేరుకున్నాడు. మరుసటి రోజు 16న తెల్లవారుజామున వెళ్లిపోయాడు. వెళ్లిన అతడు గుడిమల్కాపురం గ్రామానికి చేరకపోవడంతో కుమారుడి కోసం తల్లిదండ్రులు బంధువుల ఇళ్లతో పాటు ఇతర ప్రాంతాలలో వెతికారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో మరోసారి శుక్రవారం మిర్యాలగూడకు వచ్చి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అతడి ఆచూకీ తెలిస్తే 8712670189ను సంప్రదించాలని కోరారు.

# గురుకులాల్లో చేరేందుకు అవకాశం

- ఐదో తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం
- దరఖాస్తు చేసుకునేందుకు ఫిబ్రవరి 1 చివరి తేదీ
- అదే నెల 23వ తేదీన ప్రవేశ పరీక్ష



పెద్దవూరలోని గిరిజన గురుకుల విద్యాలయం

పెద్దవూర: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకుల పాఠశాలల్లో 2025–26 విద్యా సంవత్సరానికి ఐదో తరగతిలో ప్రవేశాలకు గాను నోటిఫికేషన్ విడుదలయ్యింది. ప్రవేశ పరీక్షలో మార్కుల ప్రాతిపదికన ప్రతిభావంతులైన విద్యార్థులను ఎంపిక చేసి సీట్లు కేటాయిస్తారు. ఐదో తరగతిలో ప్రవేశం కోసం 2025 ఫిబ్రవరి 23న ప్రవేశ పరీక్ష జరుగుతుంది. ప్రవేశ పరీక్ష రాయడానికి విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ నెల 21వ తేదీన ప్రారంభమైన ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ 2025 ఫిబ్రవరి 1వ తేదీ వరకు కొనసాగుతుంది. ప్రవేశ పరీక్ష రుసుం రూ.100లు ఆన్‌లైన్‌లో చెల్లించి tgcet.cgg. gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

### దరఖాస్తుదారులకు సూచనలు

- ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరంలో నాల్గో తరగతి చదువుతూ ఉండాలి.
- ఓసీ, బీసీ, బీసీ మైనారిటీ విద్యార్థులు 9 నుంచి 11 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 9 నుంచి 13 ఏళ్ల వయస్సు కలిగి ఉండాలి.
- విద్యార్థి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణం ప్రాంతం వారికి రూ.1,50,000, పట్టణ ప్రాంతం వారికి రూ.2 లక్షలకు మించకూడదు.
- ప్రవేశ పరీక్ష పూర్తిద్దాబ్జెక్టివ్ పద్ధతిలో ఓఎంఆర్ విధానంలో 100 మార్కులకు నిర్వహిస్తారు.
- ప్రశ్నపత్రం తెలుగు/ఇంగ్లిష్ మీడియాలలో ఉంటుంది.
- ప్రవేశ పరీక్షలో తెలుగు (20 మార్కులు), ఇంగ్లిష్ (25 మార్కులు), గణితం (25 మార్కులు), మెంటల్ ఎబిలిటీ (10 మార్కులు), పరిసరాల విజ్ఞానం (20 మార్కులు) సబ్జెక్టుల్లో నాల్గో తరగతి స్థాయిలో ప్రశ్నంటాయి.
- ప్రవేశ పరీక్షలో వచ్చిన మెరిట్ మార్కులు, రిజర్వేషన్ ఆధారంగా సీట్లు కేటాయిస్తారు.
- ప్రస్తుత విద్యా సంవత్సరంలో నాల్గో తరగతి చదువుతున్నట్లుగా సంబంధిత పాఠశాల నుంచి బోనఫైడ్/స్టడీ సర్టిఫికెట్‌ను దరఖాస్తుతో పాటు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి.
- విద్యార్థుల ఎంపికకు ఉమ్మడి జిల్లాను యూనిట్‌గా పరిగణిస్తారు.
- ఇతర సమాచారం కోసం హెల్ప్‌లైన్ నంబర్ 1800 42545678ను ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంప్రదించవచ్చు.

### సద్వినియోగం చేసుకోవాలి



కార్పొరేట్ విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోకుండా గురుకులాల్లో విద్యా బోధన అందిస్తున్నాం. విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు ఆటలపై ఆసక్తి ఉన్నవారిని ప్రోత్సహిస్తున్నాం. గురుకులాల్లో చేరే అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. – మంగ్తా భూక్యా, ప్రిన్సిపాల్, ఎస్టీ గురుకుల పాఠశాల, పెద్దవూర

# తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

- రూ.10వేలు ఎత్తుకెళ్లిన దుండగులు



బాధితుడి నుంచి వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ యాదగిరి

చౌటుప్పల్ రూరల్ : తాళం వేసి ఉన్న ఇంట్లోకి గుర్తుతెలియని దుండగులు చొరపడి చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన చౌటుప్పల్ మండలంలోని రెడ్డిబాయి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన నందగిరి సురేష్ తన అత్త అనారోగ్యంతో బాధపడుతుండడంతో గురువారం సాయంత్రం అదే గ్రామంలో భార్యతో కలిసి వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఇదే అదునుగా భావించిన దుండగులు ఇంటి తాళం విరగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో ఉన్న రూ.10వేల నగదును అపహరించాడు. రాత్రి అత్తగారి ఇంటి వద్దనే ఉన్న సురేష్ శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చి చూసే సరికి ఇంటి తాళం తీసి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని వస్తువులు చిందరగా పడి ఉన్నాయి. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ యాదగిరి సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. గ్రామంలో రెండు నెలల్లో వరుసగా ఇళ్లల్లో దొంగతనాలు జరుగుతుండడంతో గ్రామస్తులు భయాందోళనలో ఉన్నారు. గ్రామంలో ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కార్మికులు ఉండడంతో దొంగతనాలు తరుచూ జరుగుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు.

### పేకాటరాయుళ్ల అరెస్ట్

త్రిపురారం : పేకాట ఆడుతున్న స్థావరంపై శుక్రవారం మండల పోలీసులు దాడి చేసి నలుగురు వ్యక్తులను పట్టుకున్నారు. ఎస్ఐ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నీలాయిగూడెం గ్రామశివారులో నలుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు స్థానికుల ద్వారా సమాచారం రావడంతో అకస్మికంగా దాడులు చేసి నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేశామన్నారు. వారి నుంచి రూ.20,560నగదు, 4సెల్‌ఫోన్‌లు, 2బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా పేకాట ఆడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# సాగర్‌లో పర్యాటకుల సందడి



లాంచ్ దిగి వస్తున్న పర్యాటకులు

నాగార్జునసాగర్ : ప్రపంచ పర్యాటక ప్రాంతమైన నాగార్జునసాగర్‌లో శుక్రవారం పర్యాటకులు సందడి చేశారు. మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ మృతి చెందడంతో రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం సెలవుదినంగా ప్రకటించింది. దీంతో సాగర్‌ను సందర్శించేందుకు పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా పర్యాటకులు సాగర్ ప్రధాన డ్యాం, నూతన వంతెన, ప్రధాన విద్యుదుత్పాదన కేంద్రం, బుద్ధవనాలను సందర్శించారు. లాంచీలో నాగార్జునకొండకు వెళ్లి వచ్చారు.

### సాగర్‌ను సందర్శించిన ఐజీ రమేష్‌రెడ్డి



ఐజీ రమేష్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

నాగార్జునసాగర్ : అంతర్జాతీయ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌ను శుక్రవారం ఐజీ(లాజిస్టిక్) రమేష్‌రెడ్డి కుటుంబ సమేతంగా సందర్శించారు. ఈ సందర్భంగా నాగార్జునసాగర్ విజయ్‌విహార్‌కు చేరుకున్న వారికి మిర్యాలగూడ డీఎస్పీ పి.రాజశేఖర్‌రాజు స్వాగతం పలికారు. అనంతరం వారు సాగర్ ప్రధాన డ్యాం, గ్యాలరీలను, ప్రధాన జలవిద్యుత్ కేంద్రాన్ని, ఎత్తిపోతల జలపాతాన్ని సందర్శించి లాంచీలో సాగర్ జలాశయంలో విహరించారు. రైట్ బ్యాంకులోని ఏపీఆర్‌జేసీ కళాశాలలో ఆయన పూర్వ విద్యార్థి కావడంతో ఆ కళాశాలను సందర్శించారు. తాము చదువుకునేటప్పుడు తరగతి గదులను, తాను ఆడిన ఆట స్థలాలను, నివాస ప్రాంతాలను సందర్శించి అప్పటి రోజులను గుర్తుచేసుకున్నారు. అనంతరం బుద్ధవనాన్ని సందర్శించారు. వారికి స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ నాగార్జునసాగర్ విశేషాలను, వివరాలను, బుద్ధవనం ప్రాముఖ్యతను వివరించారు. వారి వెంట సాగర్ ఎస్ఐ సంపత్‌గౌడ్, పెద్దవూర ఎస్ఐ వీరబాబు, విజయపురి సౌత్ ఎస్ఐ మహ్మద్ షఫీ ఉన్నారు.

### ట్రాక్టర్ గొర్రు తగిలి రైతు మృతి



లెనిన్ (ఫైల్)

ఆత్మకూర్(ఎస్) : ట్రాక్టర్ గొర్రు గొంతులో గుచ్చుకొని ఓ రైతు మృతిచెందాడు. ఈ ఘటన శుక్రవారం రాత్రి మండల పరిధిలోని కాశిగూడెం స్టేజి సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన రైతు కలగాని లెనిన్ (28) శుక్రవారం రాత్రి 8గంటల సమయంలో తన భార్య, కుమారులతో కలిసి కాశీగూడెం శివారులో గల తన వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి బైక్‌పై గ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో రామన్నగూడెం నుంచి కల్టివేటర్‌తో వస్తున్న గుర్తుతెలియని ట్రాక్టర్ వారి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న భార్య, పిల్లలు కిందపడగా లెనిన్‌కు ట్రాక్టర్ కల్టివేటర్‌పై ఉన్న గొర్రు గొంతులోకి దిగి సుమారు 50మీటర్లు ఈడ్చుకెళ్లింది. డ్రైవర్ ట్రాక్టర్‌ను నిలిపి లెనిన్‌ను పక్కన పడేసి ట్రాక్టర్‌తో పరారయ్యాడు. చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకునేలోగా చీకటిగా ఉండడంతో ట్రాక్టర్ కనిపించకుండా వెళ్లిపోయినట్లు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట ఆసుపత్రికి తరలించి విచారిస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

# అనాలోచిత అలైన్‌మెంట్‌తో భారీ నష్టం

- రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్



భూ నిర్వాసితులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ లక్ష్మణ్

చౌటుప్పల్ : రీజినల్ రింగ్‌రోడ్డు నిర్మాణం కోసం నిర్ణయించిన అనాలోచితమైన అలైన్‌మెంట్‌తో నిర్వాసితులకు భారీగా నష్టం జరుగుతుందని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. నిబంధనలు పాటించకుండా వ్యవహరించడంతో వందలాది మంది నిర్వాసితులు రోడ్డున పడే దుస్థితి నెలకొందని పేర్కొన్నారు. ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చాలని కోరుతూ చౌటుప్పల్‌కు చెందిన భూనిర్వాసితులు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ గంగిడి మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో ఎంపీ లక్ష్మణ్‌ను కలిశారు. అనంతరం వారు ఆయన ఎదుట తమ సమస్యను వివరించారు. కొంతమంది ప్రయోజనాల కోసం పలుమార్లు అలైన్‌మెంట్‌ను మార్చారని, కోట్ల రూపాయల విలువ చేసే భూములను బలవంతంగా లాక్కునేందుకు ప్రయత్నిస్తున్నారని భూ నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. అలైన్‌మెంట్‌ను ఇష్టానుసారంగా మార్చడంతో మున్సిపాలిటీ మూడు ముక్కలు అవ్వడంతోపాటు నివాసగృహాలు, ప్లాట్లు సైతం పోతున్నాయన్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, భూనిర్వాసితులతో కలిసి ఆయన మాట్లాడారు. దక్షిణ భాగంలో మాదిరిగా ఉత్తర భాగంలోనూ ఖచ్చితంగా 40కిలోమీటర్ల నిబంధన పాటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రీజినల్ రింగ్‌రోడ్డు హెచ్‌ఎండీఏ పరిధి తర్వాత నిర్మాణం జరగాల్సి ఉందన్నారు. ఇప్పటికే అనేక పర్యాయాలు భూములు కోల్పోయిన రైతులను మరోసారి ట్రిపుల్‌ఆర్ పేరిట అన్యాయం చేయడం సరికాదన్నారు. రైతులు, నిర్వాసితులకు కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలను నిలుపుకోవాలని, లేనిపక్షంలో నిర్వాసితులతో కలిసి ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఇప్పటికే తమ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నిర్వాసితుల గోడును కేంద్ర రోడ్డు, రవాణా శాఖా మంత్రి నితిన్‌గడ్కరీ దృష్టికి తీసుకెళ్లారని, నిర్వాసితులకు బీజేపీ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో నిర్వాసితుల ఐక్యవేదిక కన్వీనర్, సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, నిర్వాసితులు గుజ్జుల సురేందర్‌రెడ్డి, దబ్బటి రాములు, చింతల ప్రభాకర్‌రెడ్డి, బొమ్మిరెడ్డి ఉపేందర్‌రెడ్డి, ఏసిరెడ్డి దామోదర్‌రెడ్డి, జాల నర్సింహ, జాల వెంకటేష్, గుండెబోయిన గాలయ్య, వేణు, పంకర్ల యాదయ్య, తదితరులు ఉన్నారు.

### యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్



నియామకపత్రం అందుకుంటున్న వెంకటేశ్

మిర్యాలగూడ : మిర్యాలగూడ పట్టణానికి చెందిన మిట్టపల్లి వెంకటేష్ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ అధ్యక్షుడు ఉదయ్‌భాను చిబ్ శుక్రవారం ఢిల్లీలో నియామకపత్రం అందించినట్లు ఆయన తెలిపారు. తన నియామకానికి సహకరించిన జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకులకు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో యువత సమస్యల పరిష్కారానికి, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.

### పురుగుల మందు తాగి వ్యక్తి బలవన్మరణం

భువనగిరిటౌన్ : అప్పుల బాధతో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను పట్టణ పోలీసులు శుక్రవారం వెల్లడించారు. వరంగల్ జిల్లా రాయపల్లి మండలం కొండూరు గ్రామానికి చెందిన కర్రె అంజిరెడ్డి అప్పుల బాధ తట్టుకోలేక ఈ నెల 15న ఇంటి నుంచి వెళ్లాడు. వెళ్లిన అతడు ఈ నెల 18న భువనగిరికి చేరుకున్నాడు. అనంతరం ఓ లాడ్జీలో ఉండి తాను పురుగుల మందు తాగినట్లు కుటుంబ సభ్యులకు వీడియో కాల్ చేసి తెలిపాడు. దీంతో గమనించిన లాడ్జీ యజమానులు భార్యకు ఫోన్ చేసి అంజిరెడ్డిని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమించడంతో చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 27న ఉదయం మృతి చెందాడు. దీంతో భార్య సరళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

# సఖ్యతకు అడ్డొస్తున్నాడనే హత్య

- కుమార్ హత్యకేసులో భార్యతో సహా మరోఇద్దరి అరెస్ట్
- కేసు వివరాలు వెల్లడించిన డిండి రూరల్ సీఐ సురేష్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సురేష్

డిండి : సఖ్యతకు అడ్డొస్తున్నాడని భార్య ప్రియుడితో పాటు మరో వ్యక్తితో కలిసి భర్తను దారుణంగా హత్య చేసింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను శుక్రవారం దేవరకొండలోని సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ సురేష్ వెల్లడించారు. మండల పరిధిలోని దేవత్‌పల్లితండాకు చెందిన రమావత్ కుమార్(27)కు చందంపేట మండలంలోని పోల్యానాయక్‌తండాకు చెందిన లక్ష్మితో 10పంవత్సరాల క్రితం వివాహం జరిగింది. భార్యభర్తలు వ్యవసాయంతో పాటు కూలీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారికి కుమారుడు, కూతురు ఉన్నారు. కుమార్‌కు వ్యవసాయంలో కలిసి రాక పూటగడవడం కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో కుమార్ భార్య పిల్లలతో కలిసి రెండేళ్ల క్రితం హైదరాబాద్‌కు వెళ్లి కూలీ చేసుకుంటున్నారు. కూలీ పని చేస్తున్న క్రమంలో లక్ష్మీకి మధు అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. అది కాస్త వివాహేతర సంబంధంగా మారింది. కాగా 5నెలల క్రితం కుమార్ హైదరాబాద్‌లో ఉండలేక భార్య పిల్లలతో కలిసి స్వగ్రామానికి తిరిగొచ్చి వ్యవసాయం చేస్తున్నాడు.

#### ప్రియుడిని విడిచి ఉండలేక..

స్వగ్రామానికి భర్తతో లక్ష్మి రావడంతో మధు ఇటీవల కొన్ని రోజులుగా లక్ష్మి భర్త లేని సమయంలో ఇంటికి వచ్చి వెళ్తుండేవాడు. వారు ఎడబాటు తట్టుకోలేక వారు కుమార్‌ను అడ్డుతొలగించుకుంటే కలిసి జీవించొచ్చని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో కుమార్‌ను హత్య చేసేందుకు భార్య ప్రియుడు మధుతో పాటు హైదరాబాద్‌లోని మెహిదీపట్నంకు చెందిన సాయికిరణ్‌ను ఈనెల 23న గ్రామానికి పిలిపించింది. రోజు మాదిరిగానే కుమార్ తన భార్యతో కలిసి ఈనెల 24న రాత్రి వేరుశెనగ చేనుకు నీరు పెట్టేందుకు పొలానికి వెళ్లాడు. అర్ధరాత్రి తర్వాత మంచంపై పడుకున్న కుమార్‌ను అప్పటికే అక్కడ మాటు వేసి ఉన్న మధు, సాయికిరణతో పాటు లక్ష్మి కర్రలతో దాడి చేసి గొంతు నులిమి హత్య చేశారు. అనంతరం అక్కడే ఉన్న వేపచెట్టుకు చీరతో ఉరి వేసుకున్నట్లు మృతదేహాన్ని వేలాడదీసి మధు, సాయికిరణ్ అక్కడి నుంచి పారిపోయారు. లక్ష్మి మాత్రం తెల్లవారుజాము వరకు పొలం వద్దే ఉండి ఉదయం తండాకు వచ్చి తాను నిద్రిస్తున్న సమయంలో తన భర్త కుమార్ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని బంధువుల వద్ద నమ్మబలికింది. వెంటనే మృతుడి తల్లి, గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకొని కుమార్ మృతదేహాన్ని ఇంటికి తీసుకువచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కుమార్ హత్య విషయం తెలుసుకున్న సీఐ సురేష్, ఎస్ఐ రాజు సిబ్బందితో గ్రామానికి చేరుకుని వివరాలు సేకరించారు. కుమార్ ఒంటిపై గాయాలు ఉండడంతో మృతుడి తల్లి సుకి కోడలు లక్ష్మిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేసింది. దీంతో కుమార్ హత్యకు గురయ్యాడని కేసు నమోదు చేసుకొని పోలీసులు విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా మృతుడి భార్య లక్ష్మి తనతో పాటు మధు, సాయికిరణ్‌లో కలిసి కుమార్‌ను హత్య చేసినట్లు ఒప్పుకుంది. ఈ ఘటనలో నిందితులైన ముగ్గురిని అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సురేష్ తెలిపారు. హత్య కేసును రెండు రోజుల్లో ఛేదించిన డిండి రూరల్ సీఐ సురేష్, ఎస్ఐ రాజు, సిబ్బందిని ఎస్పీ శరత్‌చంద్ర పవార్, దేవరకొండ డీఎస్పీ గిరిబాబు అభినందించారు.

### విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

చందంపేట : విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని కాచరాజుపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బద్దెల గోవిందు(48) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం ఉదయం తన వ్యవసాయ పొలానికి పక్కనే ఉన్న మరొకరి పొలంలో విద్యుత్ మోటారు ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ఏరియా స్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

### ట్రాక్టర్‌ను ఢీకొని యువకుడు దుర్మరణం



మహేష్ (ఫైల్)

హాలియా : ట్రాక్టర్‌ను బైక్‌తో వెనుక నుంచి ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన పట్టణంలోని ఆంజనేయ రైస్‌మిల్లు వద్ద శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనుముల మండలంలోని నాయుడుపాలెం గ్రామానికి చెందిన పుట్ట మహేష్(22) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం మహేష్, అదే గ్రామానికి చెందిన షేక్ బాబీతో కలిసి తన ద్విచక్రవాహనంపై హాలియాకు వెళ్లాడు. హాలియాలో పని ముగించుకొని రాత్రి స్వగ్రామానికి వస్తుండగా హాలియా శివారులోని ఆంజనేయ రైస్‌మిల్లు వద్ద జాతీయ రహదారిపై నాయుడుపాలెం వైపు వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి వేగంగా వెళ్లి బైక్‌తో ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో పుట్ట మహేష్ అక్కడికక్కడే మృతి చెందగా షేక్ బాబీకి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు ఘటనా స్థలం చేరుకొని తీవ్రంగా గాయపడిన షేక్ బాబీని 108 వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పుట్ట మహేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సాగర్ కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందకపోవడంతో కేసు నమోదు కాలేదని ఎస్ఐ సతీష్‌రెడ్డి తెలిపారు.

### నేటికీ లభించని లతీఫ్ ఆచూకీ

- రెండు నెలల క్రితం అదృశ్యం .. కేసు నమోదు

ఆత్మకూర్(ఎస్) : రెండు నెలలు క్రితం ఓ యువకుడు అదృశ్యమై కేసు నమోదైనా నేటికీ ఆచూకీ లభించలేదు. వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన షేక్ లతీఫ్ (25) తల్లిదండ్రులు లేకపోవడంతో ఒంటరిగా ఉంటూ కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగా అక్టోబర్ 28న యువకుడికి ఫోన్ స్విచ్ఛ్ ఆఫ్ కావడంతో పాటు నాటి నుంచి ఆచూకీ లేదు. దీంతో యువకుడి మారుతల్లి నవంబర్ 1న మండల పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు నేటికీ ఆ యువకుడి ఆచూకీ కనిపెట్టలేకపోయారు. లతీఫ్ ఇంటికి తాళం వేయకుండా ఉండడం, ఫోన్ కూడా గ్రామంలో ఉండగానే స్విచ్ ఆఫ్ అయినట్లు టెక్నికల్ పరిశోధకులు చెప్తుండడంతో యువకుడు ఉన్నాడా లేక హత్యకు గురయ్యాడా అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో అక్రమ సంబంధం ఉన్న వ్యక్తులతో యువకుడికి వివాదం ఉన్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

# దైవదర్శనానికి వెళ్లి వస్తూ అనంతలోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో తల్లి, కుమారుడు మృతి.. మరో ఇద్దరి గాయాలు
- భువనగిరి మండల శివారులో బైక్‌ను ఢీకొట్టిన గుర్తుతెలియని వాహనం



పావని (ఫైల్)



ప్రణయ్ (ఫైల్)

భువనగిరి : యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామి దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓకే కుటుంబానికి చెందిన ఇద్దరు మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన భువనగిరి మండల పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని చంపాపేట్‌కు చెందిన బైగళ్ల జగన్ తన భార్య పావని(30), కుమార్తె సాత్విక, కుమారుడు ప్రణయ్(2)తో కలిసి శుక్రవారం ఉదయం యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామి దర్శనానికి బైకుపై వచ్చాడు. స్వామి వారి దర్శనం అనంతరం రాత్రి యాదగిరిగుట్ట నుంచి బయలుదేరారు. ఈ క్రమంలో మండల పరిధిలోని హైదరాబాద్–వరంగల్ ప్రధాన రహదారిపై దీప్తి హోటల్ వద్దకు రాగానే వారు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భార్య పావని అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు తీవ్రగాయాలతో ఉన్న కుమారుడితో పాటు స్వల్పంగా గాయపడిన తండ్రి, కుమార్తెను జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అక్కడ బాలుడి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. తల్లి, కుమారుడి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక మార్చురీకి తరలించారు. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

#### సెలవు రోజు కావడంతో..

జగన్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో పనిచేస్తున్నాడు. వరుస సెలవులు రావడంతో యాదగిరిగుట్టతో పాటు స్వర్ణగిరిలో స్వామి వారి దర్శనానికి వచ్చారు. సాయంత్రం రాయగిరి చెరువు వద్ద సంతోషంగా గడిపారు. భోజనం చేసుకున్న అనంతరం అక్కడి నుంచి బయలుదేరారు. ఈ క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు.